"సినిమాలో నీ కొలతలు థర్టీసిక్స్ – ట్వంటీఫోర్ – థర్టీసిక్స్ కదా!"

చిన్నగా నవ్వి తలవూపి మంచం పక్కనే పడివున్న వాటి వంక చూపించింది.

పేడ్స్?

సినిమా నటీమణులకి తగిన శరీర పుష్టి లేకపోతే వాటినిఇవ్వడానికి దుస్తులు కింద మేకప్‌మెన్ తొడిగే పేడ్స్ అవి?

❋

# భూమి గుండ్రంగా వుండును

ఆరోజు కలివేలు నుంచి ట్రంకాల్ వచ్చింది నాకు.

"గురూ మాకో మంచి సినిమా కథ కావాలి. ఓసారి మద్రాసుకు రాగలరా?"

"ఏ నవల?" అడిగాను

"నీ నవలలన్నీ తెప్పించి చదివాను. అందులో సినిమాకి పనికి వచ్చేవేం లేవు. మాక్కావలసిన లైన్స్‌లో కథ రాసివ్వాలి ఎప్పుడు బయల్దేర గలవు?" అడిగాడు కలివేలు.

"సెకండ్ సాటర్ డే. సండే" అడిగాను.

"వెరీగుడ్! మా మనిషి నీకు టిక్కెట్ తెచ్చిస్తాడు. నేనే రిసీవ్ చేసుకుంటాను.

కలివేలు నాతోపాటే నే పనిచేసే ఆఫీసులో పద్నాలుగేళ్ళ క్రితం చేరాడు, నాకు కథలు, నాటకాల పిచ్చి. ఆతనికి దర్శకత్వం పిచ్చి నే రాసిన నాలుగు నాటకాలు అతనే డైరెక్టు చేశాడు. ఓసారి ఆతని బంధువులు సినిమా తీస్తూ, కలివేలుని మద్రాసుకి పిలిపించారు. అసోసియేట్ డైరెక్టర్

రుగా వెళ్ళి, కెమేరామెన్‌గా స్థిరపడి, చివరికి నిర్మాత అయ్యాక ఐసు విశాఖ పట్నం వచ్చినప్పుడల్లా నన్ను చూసికాని వెళ్ళడు.

"పిలవగానే వచ్చినందుకు థాంక్స్ బ్రదర్" చెప్పాడు మద్రాసులో ఉదయం పదకొండున్నరకి హోటల్ గదికి కలివేలు, అతని అసోసియేట్ డైరెక్టర్, మరో స్నేహితుడు వచ్చారు

కలివేలు చెప్పేలైన్స్ మీద ఓ కథని అల్లి వుంచాను మద్రాస్‌కు బయలుదేరబోయేముందు ఆ ముగ్గురికి కథని ఓ పావుగంటసేపు వివరించాను. నాలుగయిదు మార్పులు సూచించారు. రెండు వొప్పుకున్నాను. మరో రెండు అలాకాదు ఇలా చేస్తే బావుంటుందని సజెస్టుచేశాను సాయంత్రానికల్లా ఒన్-లైన్ ఆర్డర్ వేసి వుంచుతానని చెప్పాను. వాళ్ళు వెళ్ళాక కథతో కుస్తీ పట్టసాగాను.

సాయంత్రం మళ్ళీదాన్ని గురించి చర్చించాం రెండు పాత్రల బదులు వాళ్ళ వలన నడిచేకథ ఓ పాత్రద్వారానే చెపితే బిగి వుంటుందని నిర్ణయానికొచ్చాం.

మర్నాడు వుదయం మరోగంటసేపు చర్చ జరిగాక కథ ఓ.కె. అయింది సాంగ్స్ పొజిషన్ గురించి చర్చించాం. సాయంత్రం కలివేలు వెంట అతని స్నేహితుడు రాలేదు. అసోసియేట్, మరొకతను వచ్చాడు.

ఇతను హిందీ సినిమాలకి డైలాగ్స్ రాస్తాడు. తన దగ్గరకూడా ఓ కథ వుందంటే వినిపించటానికి తీసుకు వచ్చాను" చెప్పాడుకలివేలు నన్ను అతనికి పరిచయం చేసి.

ఆయన సినిమా కథ చెప్పడంలో అనుభవస్థుడనిపించింది. నాలుగయిదు వాక్యాలు చెప్పగానే గుటదాకా చెప్పాడు.

అందరం మొహ మొహాలు చూసుకున్నాం. నేను క్రితం వుదయం చెప్పినకథకి చేసిన మార్పులు చేర్పులతో యథాతథంగా చెప్పాడా హిందీ డైలాగ్ రైటర్.

కలివేలు ఆయన్ని బయటకి తీసుకువెళుతూ చెప్పాడు నాతో.

"ఇది చాలా విచిత్రంగా వుంది. మళ్ళీ కలుస్తాను"

నే చెప్పిన కథనే ఆ రచయిత ఎలా చెప్పగలిగాడో నాకు అంతు పట్టలేదు. కలివేలు నమ్మకస్తుడు కాబట్టే ప్రచురింపబడని ఆ కథని చెప్పాను మరి ఇదెలా జరిగింది? ఎక్కడుంది మెలిక?

రాత్రి పదిన్నరకి వచ్చాడు కలివేలు.

"ఏమిటి? ఇలా అయింది?" అడిగాను.

చిన్నగా నిట్టూర్చి చెప్పాడు కలివేలు,

"సారీ బ్రదర్"

"సరిగా మనం అనుకున్న కథ ఆయనకీ తట్టడం కాకతాళీయంగా అనిపించడంలేదు నాకు" చెప్పాను చిరాగ్గా.

"కాకతాళీయం కాదు, పిచ్చుకతాళీయం కాదు. నా స్నేహితుడు చేసిన మోసం"

"మన కథని ఆ హిందీ రైటర్‌కి వినిపించాడా? అందువల్ల అతని కేం లాభం?" అడిగాను.

"చాలానే జరిగింది. ఈ ఇండస్ట్రీలో ఎవర్నీ నమ్మకూడదు. నా స్నేహితుడు ఆ కథని మరో తెలుగు నిర్మాతకి తనకథగా వినిపించాడట. ఆయనతోపాటు, ఆ కథని విన్న ఆయన దర్శకుడు దాన్ని వో తమిళ నిర్మాతకి తన కథగా వినిపించాడట. ఆ తమిళ నిర్మాత ఆ కథకి సూట్ అవుతాడనుకున్న వో మళయాళ దర్శకుడికి ట్రంకాల్ చేసి చెప్పాడట, ఆ మళయాళ దర్శకుడు వో హిందీ నిర్మాతకోసం మంచి కథలకోసం వెదుకుతున్నాడట దాన్ని త్రివేంద్రం నించి ఆయన బొంబేలోని తన హిందీ నిర్మాతకి వినిపించాడట. ఆ హిందీ నిర్మాత వెంటనే మద్రాసులో వో హిందీ సినిమా పనిమీద వచ్చిన ఈయనకి ఎయిర్ ఫ్రయిట్‌లో కథంతా రికార్డు చేసి పంపించాడట, దాన్ని మనకే వినిపించాడాయన"

"ఇంత గ్రంథం జరిగిందా?" ఆశ్చర్యపోయాను.

మర్నాడు వుదయం నా కథని కలివేలు సౌత్ ఇండియన్ రైటర్స్ అసోసియేషన్‌లో రిజిస్టర్ చేయించిగాని మళ్ళీ రైలెక్కించలేదు.

★